క్లుప్తంగా

బిందు సేద్యంపై సబ్సిడీ



మాట్లాడుతున్న ఏడీ

పుంగనూరు: రైతులు నీటిని ఆదా చేసుకునేందుకు బిందు సేద్యంపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకోవాలని ఏడీ శివకుమార్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18 లక్షలకు మించకుండా ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. అలాగే పెద్ద రైతులకు 70 శాతం సబ్సిడీతో రూ.3.36 లక్షల వరకు సహాయం అందిస్తారని పేర్కొన్నారు. స్ప్రింక్లర్ల కోసం 55 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఇందుకోసం రైతులు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేష్

పలమనేరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు మూడు రోజుల పాటు వివిధ అంశాలపై జరిగే శిక్షణ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్తనుంచి సంపద సృష్టి, వీధి దీపాల నిర్వహణ అంశాలపై ఎంపీడీఓ రాజేష్, ఈఓఆర్డీ బాలరాజు వివరించారు.

ప్రమాదాలకు కారణమవుతున్న మినీ బ్యానర్లు



రోడ్డు మధ్యలో ప్రమాదాలకు కారణమవుతున్న బ్యానర్ కర్రలు

పలమనేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఇటీవల కొందరు రోడ్డు డివైడర్‌కు ఏర్పాటు చేసిన మినీ బ్యానర్ కర్రలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అసలే ఇరుకైన రోడ్డు కావడంతో అటువైపు, ఇటువైపు వెళ్లే బైక్‌లు, ఆటోలకు ఈ కర్రలు తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వీటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో న్యాయవాదులు

గంగవరం: పలమనేరు న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మండలంలోని పాత కీలపట్ల, మంజునాథ కాలనీ, డ్రైవర్స్ కాలనీలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాల మేరకు పలమనేరు న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శిబిరాన్ని యానాది, గిరిజన ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు న్యాయవాదులు పేర్కొన్నారు. శిబిరంలో గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది కలిసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ ఆరోగ్యంతో పాటు విద్య, ఉచిత న్యాయ సలహాలు పొందాలంటే అర్జీ ఇస్తే ఈ సేవలను కోర్టు వారు అందిస్తారని పేర్కొన్నారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.17.63 లక్షలు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి హుండీలోని కానుకల ద్వారా రూ.17,63,301 ఆదాయం వచ్చినట్టు ఈఓ టి.హనుమంతరావు తెలిపారు. ఆలయ మండపంలో గురువారం ఎండోమెంట్ అధికారి మునిరాజులు, ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ సురేంద్రరెడ్డి పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కించారు. 11 గ్రాముల బంగారు, 386.500 గ్రాముల వెండి, 67యూఎస్ డాలర్లు, 15 సౌదీ రియల్, 14 కువైట్ దీనార్లు వచ్చినట్లు వివరించారు. 135 రోజులకుగాను రూ.17,63,301 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో అరగొండ సప్తగిరి బ్యాంక్, సచివాలయ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేరు.. తకరారు

- బర్త్ సర్టిఫికెట్‌లో పేరు మార్పులకు నిత్యం అర్జీలే
- వైద్యులకు తలనొప్పిగా మారిన వ్యవహారం

పలమనేరు: సాధారణంగా బర్త్ సర్టిఫికెట్‌లో పేరు నమోదు చేశాక దాన్ని మార్చడం కుదరని పని. తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు నిర్ణయించుకుని ఎక్కడ పుట్టిందో ఆ ఆస్పత్రి నుంచి సర్టిఫికెట్ తీసుకెళ్లడం..ఆపై అందులోని పేరు, వివరాల ఆధారంగా సంబంధిత పంచాయతీ, మండలం, మున్సిపాలిటీలలో అధికారికంగా బర్త్ సర్టిఫికెట్‌ను పొందడం పరిపాటి. కానీ ఈ మధ్య తమ పిల్లాడిపేరు బాగోలేదని, అప్పట్లో తిథి, నక్షత్రం చూడకుండా పెట్టేశామని, పెట్టిన పేరు పాత కాలం వాళ్లదిలా ఉందని, బడిలో పిల్లలు గేలిచేస్తున్నారని, దీంతో తమ బిడ్డపేరును మార్చి మరో బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలనే అర్జీలు పలమనేరు ఏరియా ఆస్పత్రికి నిత్యం ఐదారు వస్తున్నాయి. ఒకసారి బర్త్ సర్టిఫికెట్‌లో నమోదు చేసిన పేరును మళ్లీ మార్చడానికి వీలు లేదని వైద్యులు ఎంత చెప్పినా వినడం లేదు. వీరికి ఎలా అవగాహన కల్పించాలో అర్థంగాక వైద్యులు తలలు పట్టుకుంటున్నారు.



బర్త్ సర్టిఫికెట్ ప్రొఫార్మా

ఏరియా ఆస్పత్రిలో నెలకు వంద దాకా కాన్పులు

స్థానిక ఏరియా ఆస్పత్రిలో సగటున నెలకు వందదాకా కాన్పులు అవుతుంటాయి. బిడ్డ పుట్టిన వెంటనే అక్కడి సిబ్బంది మేల్, ఫిమేల్ బేబీ అనిరాసి ఎంట్రీ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆపై బిడ్డలను బడిలోనో కాన్వెంట్‌లోనో చేర్చేనాటికి ఆస్పత్రిలో బిడ్డకు పెట్టిన పేరుతో సర్టిఫికెట్ తీసుకుంటారు. మరికొందరు పేరు పెట్టకనే కేవలం మగ,ఆడ పేరిట సర్టిఫికెట్ తీసుకెళ్తారు. మళ్లీ పేరు పెట్టాక ఆ పేరిట అదే ఆస్పత్రిలో బర్త్ సర్టిఫికెట్ పొందుతుంటారు. అయితే రోజుకు నలుగురైదుగురు ఆస్పత్రికి వచ్చి తమ బిడ్డ పేరు మార్చుకుంటామనే దరఖాస్తులు ఎక్కువయ్యాయి.

లీగల్‌గా మార్చుకోవచ్చుగానీ ఆస్పత్రుల్లో కాదు..

లీగల్‌గా పేర్లు మార్చాలంటే పెద్ద తతంగమే ఉంటుంది. మైనర్లు అయితే వారి తల్లిదండ్రుల ద్వారా, మేజరైతే వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఎందుకు పేరు మార్చుకుంటున్నారో అందులో తెలపాలి. ఆపై పోలీసులు దీనిపై ఎన్‌ఓసీ ఇవ్వాలి. కోర్టు ద్వారా మొత్తం ఈ తంతు సక్రమంగా ఉంటే ప్రభుత్వం గెజిట్‌నిస్తుంది. దాన్ని ఎక్కడెక్కడ పేరు మార్చాలో ఆయా శాఖలకు గెజిట్‌ని సమర్పించాలి. ఇదంతా అంతా సులువు కాదు. ఇది తెలియని వారు నేరుగా ఆస్పత్రుల కెళ్లి పేర్లు మార్చాలని దరఖాస్తు చేసినా మార్చేందుకు ఏమాత్రం వీలుకాదు.

ఆస్పత్రిలో ఇచ్చే సర్టిఫికెట్‌లో ఏ పేరుంటే అదే ఫైనల్



బిడ్డ పుట్టిన ఆస్పత్రిలో ఆడ, మగ అని మాత్రం రాసి వివరాలుంటాయి. ఆపై తల్లిదండ్రులు పేరు చెప్పి సర్టిఫికెట్ పొందొచ్చు. అంతేగానీ ఒకసారి సర్టిఫికెట్ ఇచ్చాక అందులోని పేరు మార్చడం ఏమాత్రం వీలు కాదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. అనవసరంగా ఎవరో చెప్పారని వృథా ప్రయాసలకు వెళ్లకండి.

–శ్రీనివాసరావు, రాష్ట్ర వైద్య గణాంకశాఖ ఏడీ, విజయవాడ

బర్త్ సర్టిఫికెట్ ఇంటర్నేషనల్ ఐడెంటిటీ



ఇక్కడి ఆస్పత్రిలో జన్మించిన పిల్లల వివరాల మేరకు తల్లిదండ్రులు నిర్ణయించుకున్న పేరిట బర్త్ సర్టిఫికెట్ ఇస్తాం. ఇది అన్ని రికార్డుల్లో అంటే ఆధార్, స్టడీలలో నమోదయ్యాక మళ్లీ మా వద్దకొచ్చి పేరు మార్చాలంటే వీలుకాదు. పేరులో ఏదైనా రాయడంలో తప్పిదాలు ఉంటే సరేగానీ పేరు, ఇంటి పేరు కావు. 11 రకాల ఐడీల్లో అంతర్జాతీయంగా ఎక్కువ విలువైంది బర్త్ సర్టిఫికెట్ అనేది గుర్తుంచుకోవాలి.

–డా.మమతారాణి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పలమనేరు

మౌలిక వసతులపై స్పందించండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలో ప్రజలు తెలిపిన సమస్యలపై వెంటనే స్పందించి తక్షణమే పరిష్కరించడానికి అధికారులు కృషిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన మండల పలుశాఖాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి పెండింగ్‌లోని అన్ని పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు



స్థలం హద్దులు చూపుతున్న రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని నాయునివారి పాళ్యం ప్రజల సౌకర్యార్థం మాలమహానాడు నేతల వినతి మేరకు తహసీల్దార్ హనుమంతునాయక్ స్పందించారు. గురువారం మారాజు కుంట సమీపంలోని సర్వే నంబర్ 134/7లో 50 సెంట్ల స్థలాన్ని శ్మశాన వాటిక కోసం కేటాయించామన్నారు. గతంలో ఉన్న దానికంటే అదనంగా మరో పది సెంట్ల స్థలం కేటాయించామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సరిహద్దులను గుర్తించారు. వీఆర్వో నాగేంద్రనాథ్‌రెడ్డి, సర్వేయర్లు చంద్రశేఖర్, పద్మజ, మాలమహానాడు నేతలు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

పుంగనూరు: డెబ్బై ఎనిమిదో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, రాజారెడ్డి, గణేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ దేశభక్తిని పెంపొందించేందుకు కులమతాలకతీతంగా దేశభక్తిని చాటాలని కోరారు. 15వ తేదీ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మొక్కుబడిగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



రామకుప్పం మండలం నారాయణపురం తాండ స్కూల్ కమిటీ అధ్యక్షుడిగా సుందర్ నాయక్

- అధికార పార్టీ నేతలు నివేదిక మేరకే ఎన్నికలు
- 7వ మైలు గ్రామంలో ఎన్నికలు వాయిదా

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు మొక్కుబడిగా ముగిశాయి. పాఠశాలలో చదువుకునే విద్యార్థుల తలిదండ్రులతో సమావేశం నిర్వహించి కమిటీ ఎన్నికలు జరపాలి. అలా కాకుండా అధికార పార్టీ నేతలు ముందస్తుగా అభ్యర్థులను టీచర్ల కమిటీ ఎన్నికలను ఏకగ్రీవం చేసినట్లు ప్రకటించుకుని విద్యార్థులు తల్లితండ్రులచే సంతకాలు తీసుకుని స్కూల్ కమిటీ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికలు పూర్తి చేశారు. 419 పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికల్లో ముగిశాయి. శాంతిపురం మండలం 7వ మైలు ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలను వాయిదా వేశారు. ఈ పాఠశాలలో 32 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. స్కూల్ కమిటీ ఎన్నికల సందర్భంగా 17 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వీరితో 11 మంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు తనికాచలంకు మద్దతు పలికారు. టీడీపీ సానుభూతిపరులురాలు కుష్బుకు నలుగురు మాత్రమే మద్దతు పలకడంతో అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు ఎన్నికల వాయిదా వేయించారు. మంకలదొడ్డి గ్రామంలో విద్యార్థుల తల్లిందండ్రుల కోరం లేక ఎన్నికలను నిలిపివేశారు. వసనాడు గ్రామంలో టీడీపీ మద్దతుదారులు ఇద్దరు పోటీ పడడంతో ఎన్నిక వాయిదా పడింది. రామకుప్పం మండలం నారాయణపురం తాండ గ్రామంలో ప్రాథమిక పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ మద్దతు దారుడు సుందర్‌నాయక్ ఎన్నికయ్యారు.

పచ్చ నేతల కనుసన్నల్లోనే ఎన్నికలు

- ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- కొన్ని చోట్ల మళ్లీ ఎన్నికలకు టీడీపీ నేతల ఒత్తిళ్లు
- తాము చెప్పినట్టు చేయాలంటూ హెచ్‌ఎంలకు హుకుం



పలమనేరు హైస్కూల్ పాఠశాల నిర్వహణ కమిటీతో అధికారులు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, కస్తూరిబా, మోడల్ పాఠశాలల్లో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు పచ్చనేతల కనుసన్నల్లోనే జరిగాయి. కొన్ని పాఠశాలల్లో టీడీపీ అనుకూల కమిటీలు ఎన్నికకాకపోవడంతో అక్కడ మళ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ పచ్చనేతల బెదిరింపులు కూడా సాగాయి. మొత్తం మీద అధికారంలో మేమున్నాం తాము చెప్పినట్టే జరగాలని నాయకులు సంబంధిత హెచ్‌ఎంలపై ఒత్తిళ్లు తేవడం పలుచోట్ల కనిపించింది. వీరి దెబ్బకు ఎన్నికలకు పర్యవేక్షకులు వ్యవహరించిన మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, కిందిస్థాయి సిబ్బంది సైతం నామమాత్ర అవతారాన్ని ఎత్తారు.

అధికార పార్టీకి అనుకూలంగానే..

నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 469 దాకా ఉన్నాయి. వీటితోపాటు మూడు కస్తూరిబా, మూడు సంక్షేమశాఖ, ఓ గురుకుల పాఠశాలకు ఏఎంసీ ఎన్నికలు గురువారం జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా ఎన్నికలను నిర్వహించి ఆపై కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎంపిక చేసి వారిచే మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణ స్వీకారం జరిపించారు.

పలుచోట్ల ఎన్నికలపై అభ్యంతరాలు..

అధికారంలో ఉన్న తమకు తెలియకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారంటూ టీడీపీ నాయకులు హెచ్‌ఎంలపై వాగ్వాదానికి దిగారు. తాము లేని ఎన్నికలు జరగనట్టేనని వీటిని మళ్లీ నిర్వహించాలంటూ పట్టుబడ్డారు. తల్లిదండ్రులు తప్ప ఇతరులకు ఎన్నికల్లో సంబంధం లేదని హెచ్‌ఎంలు వారించినా వారు వినలేదు. ఆమేరకు పలమనేరు మండలంలోని ముడివారిపల్లి, జల్లిపేట గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇంకొన్ని గ్రామాల్లో ఎన్నికలకు ముందే సంబంధిత టీడీపీ నాయకులు పాఠశాలల వద్దకు చేరుకొని వారికి అనుకూలంగా పాఠశాల ఎన్నికలను మలుచుకున్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని 36 ప్రాథమిక పాఠశాలలకు గాను 23 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవం అయినట్టు ఎంఈఓ శ్రీరాములు తెలిపారు. అలాగే 13 పాఠశాలల్లో కమిటీని ఎన్నిక ద్వారా ఎంపిక చేసినట్టు చెప్పారు. 9 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 7 ఏకగ్రీవం కాగా రెండు పాఠశాలల్లో ఎన్నిక నిర్వహించామన్నారు. నాలుగు ఉన్నత పాఠశాలల్లో 3 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్టు వెల్లడించారు. ఎంజేపీ గురుకుల పాఠశాలలోను ఎన్నికలు నిర్వహించారు. కాగా పాలమంద ఉన్నత పాఠశాలలో ఎన్నిక వివాదమైంది. ఎలక్షన్‌లో పోటీ పడ్డ రెడ్డెప్ప, సాబ్‌జాన్‌కు చెరో 10 ఓట్లు వచ్చాయి. దీంతో మళ్లీ ఎన్నిక నిర్వహించడంతో రెడ్డెప్పకు 14 ఓట్లు వచ్చినట్టు పరిశీలకులు ప్రకటించి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. తిరిగి టీడీపీ నేతలు ఒత్తిడి చేయడంతో ఎన్నిక చెల్లదని ప్రకటించారు. దీనిపై సాయంత్రం వరకూ కూడా అధికారులు తర్జన భర్జనలు పడుతున్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు.

పలమనేరు మెప్మాకు కొత్త సిబ్బంది

పలమనేరు: పలమనేరు పట్టణంలో డాయ్ యాప్ మోసాలకు బాధ్యులుగా సస్పెండ్ అయిన అధికారుల స్థానంలో కొత్త వారు గురువారం విధుల్లో చేరారు. ఆ మేరకు మెప్మా పీడీ రాధమ్మ ఆదేశాల మేరకు ఇక్కడి సీఎంఎంగా బాబా, సీఓగా ధనలక్ష్మి, మరో ఆపరేటర్ స్థానిక కమిషనర్‌ను సంప్రదించి విధుల్లో చేరారు. సస్పెండ్ అయిన ఆర్‌పీలను త్వరలో నియమించనున్నట్టు ఈసందర్భంగా పీడీ తెలిపారు. డాయ్ యాప్ ద్వారా మెప్మాలోని సిబ్బంది కారణంగా ఇక్కడ రూ.5కోట్ల దాకా బాధితులు మోసపోయిన విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన మెప్మా సిబ్బందిపై విచారించిన కమిటీ ఇచ్చిన రిపోర్ట్ మేరకు సిటీ మిషన్ మేనేజర్ ఉమేష్‌జాదవ్, ముగ్గురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రాజేష్ అనే డాటా ఎంట్రీ ఆపరేటర్‌తోపాటు 14మంది ఆర్‌పీ(రిసోర్స్‌పర్సన్లు) విధులనుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీంతో మెప్మాకు కొత్త సిబ్బందిని నియమించారు.

కళాశాలలో మొక్కలు నాటారు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, ట్రస్ట్ చైర్మన్ సాయి శ్రీనివాసమూర్తి కలసి మొక్కలు నాటారు. గురువారం కళాశాలలో మొక్కలు నాటి, పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమష్టి కృషితో అభివృద్ధి చేద్దాం



ఎంపీడీఓ కృష్ణవేణిని సత్కరిస్తున్న సర్పంచులు, నేతలు

చౌడేపల్లె: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి చేద్దామంటూ వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. గురువారం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణవేణి, తహసీల్దార్ హనుమంతనాయక్‌ను సర్పంచులు, మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసికట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం శాలువతో సత్కరించారు. వారి వెంట సర్పంచులు ఓబుల్‌రెడ్డి, షంషీర్, రఘునాథ్‌రెడ్డి, నేతలు నాగభూషణరెడ్డి, రవికుమార్‌రెడ్డి, మల్లీశ్వర్‌రెడ్డి, ఓబులేసు, రవికుమార్, బాబు పాల్గొన్నారు.

ఆగిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు

- నియోజకవర్గానికి మంజూరైన ఇళ్లు 13వేలు
- ఇప్పటిదాకా పూర్తయిన ఇళ్లు 8,549 వేలు
- వివిధ దశల్లో 4,451 ఇళ్లు
- రెండు నెలలుగా స్తంభించిన నిర్మాణ పనులు



పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డి జగనన్న లేఅవుట్‌లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

పలమనేరు: సొంతిల్లు కట్టుకోవాలన్నదే ప్రతి పేదవాని కలను నిజం చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలమనేరు నియోజకవర్గంలో నిజం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలను మంజూరు చేయాలనే తలంపుతో నియోజకవర్గంలో 13,307 జగనన్న ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 9వేల ఇళ్లు పూర్తికాగా మిగిలినవి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ దశల్లో నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. వీటి నిర్మాణాలకు రూ.177 కోట్లను గత ప్రభుత్వం వెచ్చించింది.

ఇదిగో సాక్ష్యం...

ప్రైవేటు వెంచర్లను తలదన్నేలా పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి జగనన్న కాలనీ లేఅవుట్ తయారైంది. ఇక్కడ మొత్తం 3031 ఇళ్లు మంజూరైతే ఇందులో వీటిలో 1,721 ఇళ్లు మాత్రం పూర్తయ్యాయి. 14 ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఆర్‌బీఎల్‌లో 30, బీఎల్(బిలో లింటర్) 892, ఎల్‌ఎల్‌లో 48, ఆర్‌ఎల్(రూఫ్‌లెవల్) 195, ఆర్‌సీలో 123గా ఉన్నాయి. కాలనీలో మంచి వాతావరణం, పక్కావాస్తు కలిగిన స్థలంలో కాలనీ ఏర్పాటైంది. లేఅవుట్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా 30 అడుగులతో రోడ్లకు స్థలాన్ని కేటాయించారు. కాలనీలో పూర్తిస్థాయిలో గత ప్రభుత్వంలోనే ట్రాన్స్‌కో విద్యుద్దీకరణ చేపట్టింది. మున్సిపల్ అధికారులు తాగునీటి కోసం కొత్తగా బోర్లను డ్రిల్ చేసి వాటికి మోటార్లను అమర్చి మంచినీటి కోసం సింథటిక్ ట్యాంకులను సైతం ఏర్పాటు చేశారు. ఇక వీధుల అభివృద్ధి పనులను, డ్రైన్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇదేవిధంగా నియోజకవర్గంలో 12 లేఅవుట్లు ఉన్నాయి.

నియోజకవర్గంలో ఇళ్ల వివరాలిలా....

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
బైరెడ్డిపల్లి	1993	1337
గంగవరం	1704	1218
పలమనేరు	1227	1000
మున్సిపాలిటీ	3031	1721
పెద్దపంజాణి	1732	1273
వి.కోట	3313	2000
మొత్తం	13,000	8,549

జూలై నుంచి పనులు ముందుకు సాగడం లేదు..



డివిజన్ పరిధిలో జూలై నుంచి పక్కా గృహాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా లబ్ధిదారులు పనులు చేసేందుకు ఎందుకో ముందుకు రావడం లేదు. ఇంటి పనులు చేసిన వారికి బిల్లులు సైతం అందుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

–రమేష్‌రెడ్డి, డీఈ, హౌసింగ్, పలమనేరు

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నేతలు

పలమనేరు: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా పలు ప్రజాసంఘాలు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆపై ఆర్డీఓ మనోజ్‌రెడ్డికి ఓ వినతిపత్రాన్ని అందజేశారు. కేంద్ర బడ్జెట్‌లో దళితులకు పూర్తిగా అన్యాయం జరిగిందని ఈ సందర్భంగా ఆ నేతలు తెలిపారు. వ్యవసాయ, కార్మిక, అసంఘటిత రంగాలకు నష్టం జరిగేలా ఉన్న వారికి బాగుపడేలా కేంద్రం బడ్జెట్‌లో పక్షపాతం చూపిందన్నారు. దీనిపై తాము నిరసనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఇందులో కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా నేతలు ఈశ్వర్, ఓబుల్‌రాజు, భువనేశ్వరి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆదివాసి దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంకు గిరిజన సంక్షేమ సంఘాలు, గిరిజనులు, ప్రజలు పాల్గొనాలని అధికారులు సూచించారు.

పోస్ట్‌మన్ సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: గుడిపాల పాపిశెట్టిపల్లె పోస్ట్‌మన్ శ్యాంసుందర్‌ను సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ లక్ష్మణ్ తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులకు పోస్టల్ డెలివరీలు చేయనందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.